నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 27 జనవరి 2025
www.ntnews.com

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది.

ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి...
editpage@ntnews.com

ఫాగ్ చల్ రహా హై

కళ్లు రెండు నదుల సంగమస్థల
సుడులై పరస్పరంలోకి ప్రవహించి
విశాల సముద్రాన్ని నిర్మించాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచు తెర

అభిప్రాయాలు అవుననో కాదనో చెప్పే
నిక్కచ్చి మాటల నిలదీత నిషిద్ధమైన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచుతెర

బతుకు మలుపుల
మెతమెత్తని గుసగుసలు
దుఃఖపు మరకల్ని చెరిపి
గుండె మకిలిని వదిలించాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచుతెర

ఆత్మ మైదానం మీద దేహాల సాగు
కంకర నేలలో నవ్వులు కాకర పూ
మెరుపులు అవాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచుతెర

రాజ్యాన్నీ మతాన్నీ కలిపి కుట్టి
నెత్తికి బరువెత్తిన మోతను
అల్కగ చేయాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచుతెర

కొందరి కలలకు జీవాన్నిచ్చి
ఎవరి ఆకాంక్షలనో పెంచి పోషించి
తల్లిగర్భం ఆకృతిలో
దేహాన్ని అమర్చుకోవాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచు తెర

ఎండకు తడిచిన తోటలో సంబురాలు
అడవిపూలయి గాలిని ఆనంద
పరిమళంగా మార్చాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచు తెర

పురాతన వంతెనలోంచి తొలగి
పడుతున్న ఇటుకల్లా జారిపోతున్న
భుజాలు ఒకటికొకటి అండగా
నిలబడి ఏంకాత దూరాలను
అంతం చేయాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచుతెర

హృదయాలన్నీ బృందగానాలై నరనరాల్లో
తాళయుక్త ప్రతిధ్వనుల ఫ్లాష్ మాబ్
లబ్ డబ్ రాగం ఆలపించాల్సిన చోట
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచుతెర

సంభాషణ మాటకుమాటై
అర్థాలు మార్చుకుంటున్న చోట
కరచాలనం ఖడ్గచాలనమై
అపార్థాల వేషంకట్టే వేళ
మనిషికీ మనిషికీ మధ్య మంచుతెర

సూర్యుడు ముద్దెట్టుకున్న మబ్బుతునక
మంచు మెరుపై చిటికెన వేళ్ల పెనవేతలో
ముసుగుతన్నాల్సిన వేళ
మనిషికీ మనిషికీ మధ్య ఒక మంచుతెర

అన్నిచోట్లా అంతటా
మనసుల్లో మెదళ్లలో
ఫాగ్ చల్ రహా హై

ఆ తెరలు కూల్చే
ఆ పొరలు చీల్చే
గుప్పెడు వెచ్చని పరామర్శల కోసమే
వెతుకులాట!

- ప్రసేన్
9848997241

ప్రేమా సంగీతమూ

స్వర్గంలో దేవతలు
ప్రేమా సంగీతం
అనే రెండు కండ్లతో చూస్తారు
ప్రేమా సంగీతమనే
చెవులతోనే వింటారు

పరమానంద ప్రపంచంలో
ప్రేమే భూమి, సంగీతమే సముద్రం
ప్రేమ శరీరం, పాట ఆత్మ
మెలోడీ ఓ బంగారు పాత్ర
దాని అంచుల్ని దాటి,
అమృతం ప్రవహిస్తూ వుంటుంది

ప్రేమ ఓ అతీతస్మృతి అవశేషం
పాట ఆ అవశేషాల మీద లేచిన దేవాలయం
పాట ప్రేమ, ప్రేమ పాట
ఈ రెండూ ఈ మనుషులు గాని
మనుషుల ప్రపంచంలో
బతకడం చాలా కష్టం

- లెవిస్ స్పెన్స్

(స్కాట్లాండ్ నేషనల్ పార్టీ నిర్మాతల్లో ఒకడు. కవి, జానపద శాస్త్రవేత్త, నృత్యతత్వ శాస్త్రవేత్త. యూరోపు పురాప్రపంచ గాథలనందించిన వాడు. గొప్ప మానవతావాది)



అనువాదం:
హిమజ్వాల
99497 01207

బొమ్మలు వేస్తున్న కొండపల్లి శేషగిరిరావు..

విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 1933లో హైదరాబాద్ వచ్చారు. తాను 1901లో స్థాపించిన శాంతినికేతన్ (విశ్వభారతి) ఒడిదుడుకులలో ఉన్నది. నిర్వహణకు అవసరమైన నిధులు ఇప్పిస్తానని నిజాం కార్యనిర్వాహక మండలి సభ్యుడు నవాజ్ మెహదీ నవాబ్ జంగ్ హామీ ఇస్తూ ఆహ్వానించినందుకు హైదరాబాద్ వచ్చారు. నిజాం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆ సందర్భంగా ఇప్పటి బంజారాహిల్స్ ప్రాంతంలో జంగ్ అతిథి గృహంలో రవీంద్రుడు కొద్ది రోజులున్నారు. ఆ పరిసరాలకు ముగ్ధుడైన రవీంద్రుడు; ముందే వచ్చి ఉంటే ఇక్కడే శాంతినికేతన్ స్థాపించేవాడిని అని జంగ్‌తో అన్నారు. రవీంద్రుడు శాంతినికేతన్‌ను హైదరాబాద్‌లో స్థాపించలేకపోయారు కానీ, శాంతినికేతన్‌ను కొండపల్లి శేషగిరిరావు హైదరాబాద్‌కు తెచ్చారు తన చిత్రాల రూపంలో! కొండపల్లి హృదయమూ, వారు భావితరాల కోసం పదిలపరిచిన చిత్రాలు శాంతి నికేతనాలే!

(నేడు కొండపల్లి శేషగిరిరావు శత జయంతి)

'సరస రేఖా చిత్ర
సాహిత్యమును గూర్చిన
నీదు కుంచియకు
అభివాదమయ్యా,
అప్సరసల భువిని
అవతరింపగజేయు మాంత్రికా
నీకు నమస్సులయ్యా..'

**దాశరథి కృష్ణమాచార్య
పద్య పాదాలతో
కొండపల్లికి సుమాంజలి...**



శాంతి నికేతనుడు.. కొండపల్లి

పాత వరంగల్ జిల్లా, మానుకోట (మహబూబాద్) దగ్గరలోని పెనుగొండలో 1924, జనవరి 27న కొండపల్లి జన్మించారు. బొమ్మలు వేయడం పుట్టుకతో వచ్చిన అభిరుచి. రామప్ప శిల్పాలు, పాకాల పరిసరాలు స్కెచెస్‌గా వేసేవారు. పెన్సిల్-పేపర్‌తో హైదరాబాద్ వచ్చారు. ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో పెయింటింగ్స్ నేర్చారు. రవీంద్రుడి మిత్రుడు మెహదీ నవాజ్‌జంగ్ కొండపల్లి చిత్రాలకు ముగ్ధుడై శాంతినికేతన్‌లో చేరేందుకు తోడ్పడ్డారు. ప్రపంచ నగరాల్లో నవవధువుగా ప్రఖ్యాతిచెందిన హైదరాబాద్ కొండపల్లి శాంతినికేతన్ వెళ్లేప్పుడు ప్రశాంతంగా ఉన్నది. రైల్లో తిరిగి వచ్చే సందర్భంలో శ్రీవైష్ణవుడైన కొండపల్లికి రజాకార్ల దుష్కృత్యాలు 1948లో అనుభవంలోకి వచ్చాయి. ఒక సహ ప్రయాణికుడు 'ఎవరనుకున్నావు? నవాజ్‌జంగ్ స్నేహితుడు' అనడంతో ఆపద తప్పింది.

స్వతహాగా గాంధేయవాది అయిన కొండపల్లిపై రావి నారాయణరెడ్డి, వట్టికోట, దాశరథి, కాళోజీ తదితరుల ప్రభావం పడింది. కొండపల్లి జల-తైల వర్ణాల్లో సామ్యవాద ఛాయలూ కనిపిస్తాయి. తాను చదివిన ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనే అధ్యాపకులుగా పని చేశారు. ఎందరో చిత్రకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్ఫూర్తినిచ్చిన కొండపల్లి తన చిత్రాల ద్వారా గాడ్స్ పెయింటర్ అనే ప్రశస్తి పొందారు. ఆంధ్రదేశంలో చిత్రకళ-తెలంగాణలో చిత్రకళ, కళ-కల్పనా వైచిత్రి వంటి రచనలు చేశారు. జానపద చిత్రకళను పరిచయం చేస్తూ పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. తెలుపు-నలుపు చిత్రాలు, మ్యూరల్స్ ఎన్నింటినో చిత్రించారు. అసంఖ్యాక అవార్డులు పొందారు. ఎమరిటస్ మేడం పుకు అకినో, బిశ్వనాథ్ ముఖర్జీ, ఎ.ఎస్.రామన్, పీటర్ స్వీజ్, ఎన్.ఎస్.బింద్రే, అనితారాయ్ చౌదరి, వై.వి.శుక్ల, ఎ.పెరుమాళ్ వంటి ఎందరో ప్రముఖులు వీరిని అభిమానించేవారు. హైస్కూల్ విద్యార్థి దశలో నేను కొన్న తొలి పత్రిక ఆంధ్రపత్రిక వీక్లీ. లైబ్రరీలో (1969-70) ఆ పత్రికను చూశాను. ముఖ చిత్రం పోతన. ఆ సుకవి అక్షరాలు చిత్ర రూపం ధరిస్తే అవి కొండపల్లి శేషగిరిరావు బొమ్మలే! కొండపల్లితో తొలి పరిచయం 1994లో. అదీ చిత్రంగా జరిగింది. ఉదయం పొలిటికల్ బ్యూరో రిపోర్టర్‌గా 1992లో హైదరాబాద్ వచ్చాను. రాంనగర్ వాసినయ్యాను. మనింటి దగ్గరలోనే ఉంటారని మిత్రులు లక్ష్మణరావు జి.కృష్ణకు నన్ను పరిచయం చేస్తున్నారు. మాటల్లో మాటగా గుజ్జం మల్లయ్య (1904-1984)కు బంధువు అని అన్నారు.

కొండపల్లి శేషగిరిరావు, దరువూరి వీరయ్య, జి.కృష్ణ, రాంభట్ల

అది రాశాడు, ఇది రాశాడు అని సోది చెబుతావేం? ఫలానా వారితో బంధుత్వం ఉన్నవాడు అనే ముక్క చెప్పకుండా! అన్నారు జి.కృష్ణ. వారిపై నేనొక వ్యాసం రాస్తాను, రేపు ఉదయం మీ ఇంటికి వస్తానన్నారు జి.కృష్ణ. మరుసటి ఉదయం నిద్ర లేవకముందే తలుపు తట్టారు. చేతిలో నోట్‌బుక్, పెన్ను! గుజ్జం మల్లయ్య వాటర్ కలర్ పెయింటింగ్స్ వరదకు తడిచి శిథిలావస్థలో ఉన్నాయని చెప్పినపుడు కలవరం చెందారు. ప్రదర్శిద్దాం, నా వంతు చేయి వేస్తానన్నారు, సిగ్గనిపించింది. రెండేండ్ల తర్వాత పీఎఫ్ అడ్వాన్స్ లోన్ తీసుకొని పెయింటింగ్స్ ఫ్రేమ్ చేయించి కృష్ణకు చూపించాను. ఎవరిని పిలుద్దామని అడిగాను. ఇంకెవరు కొండపల్లి శేషగిరిరావునే అన్నారు. ఆ సందర్భంగా కొండపల్లి నివాసంలో శాంతినికేతన్ చూశాను.

> **స్వతహాగా గాంధేయవాది అయిన కొండపల్లిపై రావి నారాయణరెడ్డి, వట్టికోట, దాశరథి, కాళోజీ తదితరుల ప్రభావం పడింది. కొండపల్లి జల-తైల వర్ణాల్లో సామ్యవాద ఛాయలూ కనిపిస్తాయి. తాను చదివిన ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనే అధ్యాపకులుగా పనిచేశారు. ఎందరో చిత్రకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్ఫూర్తినిచ్చిన కొండపల్లి తన చిత్రాల ద్వారా గాడ్స్ పెయింటర్ అనే ప్రశస్తి పొందారు.**

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 1994 ఆగస్టు 9న గుజ్జం మల్లయ్య పెయింటింగ్స్ మూడు రోజుల ఎగ్జిబిషన్ ప్రారంభించారు కొండపల్లి. ఆ సమావేశంలో జి.కృష్ణ, రాంభట్ల కృష్ణమూర్తి, దరువూరి వీరయ్యలు కూడా ప్రసంగించారు. శాంతినికేతన్‌లో తనకు సీనియర్ అయిన గుజ్జం మల్లయ్య, వారికి సీనియర్ అయిన మైసూర్ సంస్థానం చిత్రకారుడు వెంకటప్పయ్యల శైలి గురించి చెప్పారు. వారికి, తనకు విద్యార్థులుగా రెండు దశాబ్దాల తేడా ఉన్నదని, మా అందరికీ అవనీంద్రనాథ్ టాగోర్-నందలాల్ బోస్‌లు అధ్యాపకులు కావడం సారూప్యత అని తెలిపారు. తొలితరం ఆధునిక తెలుగు చిత్రకారులకు స్వాతంత్ర్యానికి పూర్వం లభించిన గౌరవం ఆ తర్వాత కనుమరుగైందన్నారు. చలసాని ప్రసాదరావు, ఏలె లక్ష్మణ్, శ్రీధర్, వంటి చిత్రకారులు, శివాజీ, కిషోర్ తదితర జర్నలిస్టులు, జేఎన్‌టీయూ విద్యార్థులు పాల్గొన్న ఆ సభలో కొండపల్లి తన ముందు తరాల విశిష్టతను పరిచయం చేశారు. రుషులకు సెల్ఫ్ అప్రైజల్ ఉండదు కదా. ఇది కొండపల్లి శేషగిరిరావు శత జయంతి సందర్భం. చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు పెయింటింగ్స్ ప్రదర్శిస్తున్నారు. వారు మన కోసం పదిలపరచిన వ్యాసుడు-గణపతి, రాఘవుడు-గుహుడు, వరూధిని-ప్రవరాఖ్య, మురారి, శకుంతల, గోదాదేవి, అభినవ గుప్తుడు, రామప్ప శిల్పాల వంటి అసంఖ్యాక చిత్రాల్లో ఎంపిక చేసిన చిత్రాలు కొలువై ఉన్నాయి. కలువల కొలనులో కలువ కనుల సుందరి, పల్లెల రమణీయత, ప్రకృతి దృశ్యాలు, ముఖ్యంగా తెలంగాణ వైవిధ్య జీవితం ఆహ్లాదపరుస్తాయి.

పున్నా కృష్ణమూర్తి
76809 50863

(వ్యాసర్త: ఇండిపెండెంట్ జర్నలిస్ట్, రచయిత)

ఆత్మలు చప్పట్లు కొట్టే వాక్యాలు

పూల గురించి
పరిమళ భరితమైన వాక్యం రాశాను
వాక్యాన్ని తేనెటీగ మోసుకెళ్లి
తియ్యని చినుకులుగా రాల్చింది

చెట్ల గురించి
ఎండిన ఆకులు పోగుపడినట్లు
పదాలు కుప్పలు పోశాను
పక్షులు గూట్లో పెట్టుకుని
రెక్కలతో ఉదయాన్నే
మోసుకెళ్లి, గాలికి ఊపిరి
పోస్తున్నాయ్

నది గురించి
తడి ఉన్న వాక్యాలు
ప్రవహింప జేస్తున్నా
తెలియందేముంది
కిరణాలు వాలి, సూర్యుడిని
బతికిస్తున్నాయ్

తిరుగుతూ ఉండే
భూమికి నాలుగక్షరాలు
కానుక చేశాను
పగలు రాత్రి
పనిచేస్తూ మట్టికి
జీవం పోస్తోంది

ఇప్పుడిప్పుడే
ఆత్మలు చప్పట్లు
కొట్టే వాక్యాలు
రాస్తున్నాను

లోకం
ఇంకొన్నాళ్లు
నా వాక్యాల
ఆయువుతో
సజీవమౌతుంది

**గోపాల్
సుంకర**

కవి సిద్ధార్థ సాహిత్య సమాలోచన

2025, జనవరి 27 సోమవారం సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు రవీంద్రభారతి మినీ హాల్‌లో సాహిత్య సమాలోచన జరుగనున్నది. తెలంగాణ సాహిత్య తొలి పురస్కార గ్రహీత, కవి సిద్ధార్థ కవితా సంపుటాల (1.దీపశిల, 2.బొమ్మలబాయి, 3.మల్లెల తీర్థం- మహా ఖననం) కవిత్వ, తత్వ, అస్తిత్వ వివరణలో ప్రముఖ తెలుగు విమర్శకులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాస్, అంబటి సురేంద్ర రాజు, మామిడి హరికృష్ణ, ప్రొఫెసర్ త్రివేణి, భానుశ్రీ కొత్వాల్, బుచ్చన్న, ఆదిత్య తదితరులు ప్రసంగించనున్నారు. అందరికీ ఆహ్వానం.

- జమిలి సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

వర్షం కురుస్తున్న సాయంత్రం, వెన్నెల కాస్తున్న రాత్రి, డిసెంబర్ చలిలో ఉదయిస్తున్న సూర్యుడు ఎంత అందంగా ఉంటాయో చెప్పనలవి కాదు. ఈ మూడు ఆనందాలూ కలిపి ఇచ్చే ఆనందం కన్నా పెద్దది... 'అబ్బా! ఎంత చక్కటి పోయెమ్ రాసేవు, కవీ!' అన్న మాట. అలాంటి ఆనందాలు కవులు అప్పుడప్పుడు పొందుతుంటారు. ఈ మధ్య ఆ మాటకు తోడుగా 'నీ కవిత చాలా బాగుంది. 22 భాషల్లోకి అనువాదం చేయిస్తున్నాం. అన్ని రేడియో కేంద్రాల నుంచి ప్రసారం చేస్తాం' అన్న మాట విన్నాను. ఇంకేముంది వాన చినుకుల మధ్య వెన్నెల చెదిరిపోకుండానే సూర్యోదయాన్ని చూస్తున్నట్టు అనిపించింది నాకు.

దేశమంతటా ఇంద్రధనుస్సులు

అవును! ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి అవధానుల శ్రీహరి ఫోన్ చేసి 'మీ కవిత 'ఇంద్రధనుస్సులు'ను ఈ సంవత్సరం జాతీయ కవి సమ్మేళనానికి తెలుగు కవితగా ఎంపిక చేశా'మన్నారు. మీరు 20వ తేదీ ముంబైకి వెళ్లి అక్కడ బహుభాషా కవి సమ్మేళనంలో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. వారు చెప్పిన విధంగా నేను 2024, డిసెంబర్ 20న జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో తెలుగు కవిగా పాల్గొన్నాను. ఆకాశవాణి ముంబై కేంద్రం వాళ్లు ఒక చక్కటి హోటల్లో బస ఏర్పాటు చేసి నవీ ముంబైలోని సాహిత్య మందిర్ సభాగృహంలో బహుభాషా కవి సమ్మేళనం జరిపించారు. ఒక రోజు ముందు రిహార్సల్, మరుసటి రోజు కవి సమ్మేళనం, తర్వాతి రోజు తిరుగు ప్రయాణంతో మూడు రోజులు ముంబైలో ఇతర భాషల కవి మిత్రులతో కలిసి తిరిగిన అనుభూతి మాటల్లో చెప్పలేనిది.

> నా రూమ్మేట్‌గా ఉన్న సుప్రసిద్ధ నేపాలీ కవి దల్‌సింగ్ అకేలా వయసులో పెద్దవాడైనా నన్ను ఎంతో స్నేహంగా పలకరించి నా కవిత్వం గురించి, ఇతర రచనల గురించి ఆరా తీశాడు. ఇంకా మణిపురి కవి టాంగ్‌బ్రం అమర్జిత్, కన్నడ కవి నిజలింగప్ప మట్టిహాల్, సంస్కృత కవి యువరాజ్ భట్టారాయ్ తదితర తెలుగేతర కవి మిత్రులతో ఒక గొప్ప స్నేహ పూర్వకమైన సంభాషణ కొనసాగింది. 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కవి సమ్మేళనం ప్రారంభమైంది.

అక్కడ వింత ఏమిటంటే చాలా భాషల కవితలు బొంబాయి స్థానిక శ్రోతలకు ఏ మాత్రం అర్థమయ్యే అవకాశం లేదన్న సంగతి మాకు తెలుసు. అయినా మేం గొప్ప ఉద్వేగంతోనే మా కవితలు చదివాం. నాకు బాగా గుర్తుంది... తమిళ కవి భారతన్, మలయాళ కవి మాధవన్ పురుచ్చేరి, అస్సామీ కవి రాజీవ్ బారువతో పాటు నేను చదివిన 'ఇంద్రధనుస్సులు' కవిత కూడా అక్కడి ఆడియన్స్‌కి ఒక్క ముక్క కూడా అర్థమయ్యే అవకాశం లేదు. అయినా అత్యంత ఆసక్తికరంగా చదివాం. ఇద్దరు హిందీ కవులు, ఇతర భాషా కవులు అంతా చదివాక హిందీకి కొద్దిగా సంబంధం ఉండే కవుల కవితలు అర్థం అయి, కానట్టుగా కొందరికి అర్థమయ్యాయి. ఈ జాబితాలోకి మరాఠీ, గుజరాతీ, పంజాబీ, ఉర్దూ, కశ్మీరీ, మైథిలీ, సింధీ, సంతాలీ భాషలు వస్తాయి. హిందీకి అసలే సంబంధంలేనివైన దక్షణాది భాషల కవులు ఒరిజినల్ కవిత చదువుతున్నప్పుడు మధ్యలో ఎలాంటి చప్పట్లు మోగవు కానీ, కవిత పూర్తయిన తర్వాత ఏదో ఒక భావోద్వేగాన్ని అందిపుచ్చుకున్న వాళ్లలాగా ప్రేక్షకులంతా చప్పట్లు కొట్టారు.

ఒక 'మూల కవిత' చదివాక వెనువెంటనే హిందీలో దాని అనువాదం చదివినప్పుడు చాలా స్పందన వచ్చింది. మధ్యలో చప్పట్లు మోగాయి. నా తెలుగు కవిత హిందీలో 'ఇంద్రధనుష్' పేరు మీద డాక్టర్ అలోక్ రంజన్ పాండే చదివినప్పుడు కూడా మధ్యలో చప్పట్లు మోగాయి. దాదాపు ఈ కవితల సారాంశంలో కేంద్ర బిందువు-మానవ సంబంధాలు, దేశభక్తి, స్త్రీల సాధికారత అని నాకు అర్థమైంది. అప్పుడు నాకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సాహిత్య అకాడమీని ప్రారంభిస్తూ చెప్పిన మాట 'Indian literature is one though written in many languages and scripts' గుర్తొచ్చింది. సభా కార్యక్రమంలో భాగంగా సత్కారం, ధ్రువీకరణ పత్రాల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథి ముంబై విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ కరుణాకర్ ఉపాధ్యాయ్ స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం ఇస్తూ... 'కళలన్నింటిలోనూ కవిత్వ సృజన ప్రధాన కళ' అని ఆనందవర్ధనుడు అన్న మాటను గుర్తుచేశారు. సభ పూర్తయిన తర్వాత అందరూ భిన్న భిన్న యాసలలో హిందీని, ఇంగ్లీషును మాట్లాడుతూ తమ అభిప్రాయాలను పంచుకోవడం చూస్తే భారతదేశం ఒక భిన్న భాషలనే పూలమొక్కల తోట అనిపించింది.

సర్వభాషా కవి సమ్మేళన 2024
National Symp

హోటల్ నుంచి కవి సమ్మేళన ఆడిటోరియంకు ప్రయాణించే బస్సులో కొందరికి సీట్లు దొరికాయి. కొందరు నిలబడి ప్రయాణించారు. ఈ క్రమంలో నేను రెండవ సీట్‌లో కూర్చొని నా కవితను ఒక ట్రాన్స్‌ఫరెంట్ ఫోల్డర్‌లో పెట్టుకున్నాను. నా సీటుకు పక్కగా నిలుచున్న కొంకణి కవయిత్రి రాజశ్రీ సాయిల్ ట్రాన్స్‌ఫరెంట్ ఫోల్డర్ నుంచి కనిపిస్తున్న నా తెలుగు కవిత శీర్షికను గమనించి 'Is it Indra dhanush?' అని అడిగింది. 'yes, how did you recognise?' అన్నాను నేను. దానికి ఆమె 'నాకు కొంచెం కన్నడం వచ్చు. ఇది కన్నడం లాగే ఉంది కదా!' అన్నది. అప్పుడు నాకు చాలా ఆనందం వేసి, 'అవును కన్నడ, తెలుగు లిపి ఏకీకరణ ప్రతిపాదన కూడా ఉన్నద'న్న సంగతి చెప్పాను. ఆమె అది తెలియదన్నట్టు ఆశ్చర్యపోయింది. 'ఇంద్రధనుస్సులు' కవిత కాన్సెప్ట్ కూడా అడిగింది. అది స్త్రీకి ఒక సంకేత రూపంగా పెట్టానని చెప్పాను. దానికి ఆమె చాలా సంతోషించింది.

ఆ రోజు సాయంకాలం ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన తెలుగేతర కవి మిత్రులతో ఆయా భాషల సాహిత్య చరిత్రల వివరాల గురించి నేను కొంత ఆరా తీశాను. కొంతమంది చెప్పిన వివరాలను బట్టి చాలా భాషలు తెలుగంత పురాతన చరిత్ర కలిగినవి కావని కూడా నాకు అర్థమైంది. కొంతమంది సాహిత్య చరిత్ర పట్ల అంత స్పష్టత లేనివారు కూడా ఉన్నట్టు అనిపించింది. నాకు ఆశ్చర్యం కలిగించిన ఒక్క అంశమేమిటంటే తెలుగు పద్యంలో ఉన్నంత వైవిధ్య భరితమైన ఛందస్సేదీ ఇతర భాషల్లో లేదనిపించింది. నేను వారికి కొంత చెప్పడానికి ప్రయత్నం చేశాను. తెలుగులో పలురకాల పద్యాలున్నాయని, ప్రాచీన సాహిత్యం అంతా కూడా ఆ పద్యాల్లోనే రాయబడిందని, దాని ప్రకారం ఎక్కడ పొట్టి అక్షరం, ఎక్కడ పొడుగు అక్షరం రావాలో కచ్చితంగా పాటించవలసి ఉంటుందని చెప్తే వాళ్లు ఆశ్చర్యపోయారు. ముఖ్యంగా ఒడియా వాళ్లకు అంత కఠినమైన ఛందస్సు ఏదీ లేదని వాళ్లు స్పష్టంగానే చెప్పారు.

> జాతీయ కవి సమ్మేళనం స్ఫూర్తితో హైదరాబాద్‌లో అడుగు పెట్టాక నా కవితలాగే అన్ని భాషల కవితలను తిరిగి తెలుగులోకి అనువాదం చేయించే బాధ్యత ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం తీసుకున్నది. అందులో భాగంగా హైదరాబాద్ కేంద్రంలో దేశంలోని ఇతర 22 భాషల్లోని ఎంపిక చేసిన జాతీయ కవితలను తెలుగులోకి అనువదింపజేశారు.

ఆ అనువాదకులతో కలిపి మూలకవిగా నేను కూడా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో 2025, జనవరి 17న ఇక్కడి కవి సమ్మేళనంలో పాల్గొన్నాను. ఇక్కడ ఆనందం కలిగించే విషయం ఏమంటే తెలుగులో అత్యంత సుప్రసిద్ధ కవుల చేతనే ఇతర భాషా కవితలను అనువదించారు. ఆ రకంగా కొలకలూరి ఇనాక్ లాంటి అత్యంత సీనియర్ రచయిత నుంచి నా దాకా 24 కవితలతో కవి సమ్మేళనం నిర్వహించబడింది, రికార్డు చేయబడింది. మంచి జ్ఞాపిక కూడా ఇచ్చారు. ఇవే కవితలు 25వ తేదీ సాయంత్రం ప్రసారమయ్యాయి.

ఈ కార్యక్రమంలో నిజమైన ఇంకొకసారి లభించని జ్ఞాపిక ఏమిటంటే... కొలకలూరి ఇనాక్, అమ్మంగి వేణుగోపాల్, నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, దర్భాశయనం శ్రీనివాసాచార్య, శిఖామణి, మహెజబీన్, చిల్లర భవానీదేవి, మామిడి హరికృష్ణ, ఐనంపూడి శ్రీలక్ష్మి, శిలాలోలిత, యాకూబ్, జింబో, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మందలపర్తి కిషోర్, ఆర్.అనంతపద్మనాభరావు, సమ్మెట నాగమల్లేశ్వరరావు, తాడేపల్లి పతంజలి, వై.ముకుంద రామారావు, శరత్ జోత్స్నారాణి, సుమనస్పతి నేనూ ఒకే ఫొటోలో ఒదగడం; నిర్వాహకులు శ్రీహరితో సహా. కాలం గడుస్తున్నకొద్దీ ఇది మరింత విలువైన తీపి జ్ఞాపికగా మారుతుంది.

**ఏనుగు
నరసింహారెడ్డి**
8978 869183

వికసించేనా..?

దట్టమైన వస్త్రాన్ని
లోకమంతా కప్పినట్టు
తెల్లని పొగ
భేదమింత చూపకుండా
సందు సందునూ
వేటాడుతున్నది

దినకరుని కిరణాలు సోకి
నెమ్మదిగా విచ్చుకుంటూ
పుప్పొడిగా రాలుతున్న
హిమపాతం
అనుకుంటున్నారా?
కాదు కాదు..

నక్షత్ర మాలలను
దేహమంతా నింపుకొన్న
చంద్రుని సామ్రాజ్యం నుంచి
ఎడతెరిపి లేకుండా కురిసే
పండు వెన్నెల గిలిగింత కాదు

ఆకుపచ్చని
చెట్ల పరువాన్ని
ఆశగా అల్లుకుపోతూ
వెండి ఛాయను కప్పుతున్న
హేమంత రుతువు కాదు

దేశ రాజధాని నగరంపై
పంజా విసిరిన కాలుష్యం
మానవ తప్పిదాలతో
మరణానికి మార్గమైన
విషపు గుళిక
గాలిని గుప్పిట పట్టి
ఊపిరికి ఉరితాడై
వేలాడుతున్న భూతం

గణాంకాలను మించి
మనుగడకు ప్రమాదంగా
మేధస్సుకు సవాలుగా
అంతుచిక్కని మాయ
కారణాల చిక్కువిడి
స్వచ్ఛంగా వికసించేదెప్పుడో..?
వారి జీవన గమ్యంలో
సుగంధాలు విరిసేదెప్పుడో..?

అరుణ ధూళిపాళ